సాక్షి
జనగామ
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025


బతుకమ్మకుంట వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

న్యూస్‌రీల్

కమిషనరేట్‌లో పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డి.విశ్వేశ్వర్ గీసుకొండకు, గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆకునూరి మహేందర్ పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.వంశీకృష్ణ గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు, సంగెంలో పని చేస్తున్న నరేశ్‌ను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు, బి.రామారావు సుబేదారి నుంచి జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని నిరసన



జనగామ రూరల్: తరిగొప్పుల మండలం అంకుశాపూర్ గ్రామంలో సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీకి కేటాయించాలని గ్రామంలోని నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. 1957 నుంచి అన్ని కులాలకు రిజర్వేషన్ ఇచ్చారని కానీ ఎస్సీ కులానికి ఇప్పటివరకు సర్పంచ్ రిజర్వేషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ అభ్యర్థులకు రిజర్వేషన్ వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో భిక్షపతి, నాగభూషణం కిరణ్‌కుమార్, పైసా ప్రేమ్‌కుమార్, జంజాల సంతోష్, మాచర్ల ప్రేమ్‌కుమార్, చిన్న మూర్తి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక


అరుణాదేవి

జనగామ రూరల్: టీజీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాల్లో పట్టణంలోని వికాస్ నగర్‌కు చెందిన గుండా అరుణాదేవి ఎంపిక అయ్యారు. గృహిణిగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఆన్‌లైన్ కోచింగ్ తీసుకొని ఇంటి వద్ద ప్రణాళిక బద్ధంగా పోటీ పరీక్షకు సన్నద్ధమై విజయం సాధించారు. భర్త చంద్రశేఖర్ కృషి, పిల్లల ప్రోత్సాహం ఉందని ఆమె తెలిపారు.

జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా రామారావు



జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా బి.రామారావును నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సన్ ప్రీత్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఎస్సై రామ్‌చరణ్ స్థానంలో సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రామారావును జఫర్‌గఢ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

టీఏపీటీఏ జిల్లా అధ్యక్షుడిగా దిలీప్ కుమార్



పాలకుర్తి టౌన్: తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్(టీఏపీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రంలోని సుధా హైస్కూల్ ఉపాధ్యాయుడు పోలాస దిలీప్‌కుమార్‌ను నియమిస్తు ఆసంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ నాయక్ చౌహాన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కమీషన్ బకాయిలు వెంటనే చెల్లించాలి

జనగామ రూరల్: జిల్లాలో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్ బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా 330 రేషన్ షాపులు ఉన్నాయని, గత ఆరు నెలల కమీషన్ రాక డీలర్లు నానా ఇబ్బందులు పడ్తున్నారన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే అక్టోబర్ నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు సబ్బానీ శ్రీధర్, దేవసాని గాలయ్య, చెవ్వా శ్రీను, యాదగిరి, జయపాల్ రెడ్డి, మల్లయ్య, దయాకర్, రామగల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, కలెక్టర్, డీసీపీ తదితరులు



అంబరాన్నంటిన పూల సంబురం



జిల్లావ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ

- మహిళలు, చిన్నారులతో కిక్కిరిసిపోయిన బతుకమ్మకుంట ప్రాంగణం
- ఆటాపాటలతో మురిసిన మహిళలు
- గౌరమ్మకు ఘనంగా వీడ్కోలు

జనగామ: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సద్దుల బతుకమ్మ పండుగ సంబురాలు సోమవారం అంబరాన్నంటాయి. తొమ్మిది రోజుల పాటు సంప్రదాయ రీతిలో సాగిన బతుకమ్మ ఉత్సవాలు ముగిశాయి. జిల్లా కేంద్రంతో పాటు పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల పరిధిలోని ప్రతీపల్లె పూలవనంలా మారింది. »ఏమేమీ పువ్వొప్పునే గౌరమ్మ, తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ« అంటూ తాళాలతో పలికిన పాటలు గగనాన్ని తాకాయి. గ్రామాలన్నీ ఆట, పాటలతో మార్మోగిపోయాయి. చివరగా మహిళలు గౌరమ్మను గంగమ్మ ఒడికి చేరవేస్తూ వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా అని ప్రార్థించారు.

బతుకమ్మకుంటలో..

పట్టణంలోని బతుకమ్మకుంటలో జరిగిన సద్దుల వేడుకలకు 30 వార్డుల నుంచి మహిళలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. బతుకమ్మకుంట విద్యుత్తు దీపాల అలంకరణ, రంగురంగుల హరివిల్లులతో దేదీప్యమానంగా వెలుగొందింది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో పట్టణ నలుమూలల నుంచి పెద్ద బతుకమ్మలతో మహిళలు ఇక్కడకు చేరుకున్నారు. మహిళల పాటలు, వేలాది చప్పట్లతో బతుకమ్మకుంట భక్తి పారవశ్యంతో ఓలలాడింది.



వాడవాడలా

అలాగే పట్టణంలోని పాతబీటు బజారు, అంబేడ్కర్, ధర్మకంచ, బాలాజీ నగర్, శ్రీనగర్, తహసీల్ కార్యాలయం, రైల్వేస్టేషన్, జీఎంఆర్, శ్రీ విల్లాస్, హౌజింగ్ బోర్డు, జ్యోతినగర్ కాలనీలు, కుర్మవాడ, గోకుల్‌నగర్, హెడ్‌పోస్టాఫీసు, శ్రీ సాయిరెసిడెన్సి, చమన్ ఏరియా, గణేశ్ స్ట్రీట్, ధర్మకంచ, గుండ్లగడ్డ తదితర ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ ముగింపు సంబురాలు అంబరాన్నంటాయి.

బతుకమ్మ నిమజ్జనం..

సద్దుల వేడుకలను ఘనంగా నిర్వహించుకున్న మహిళలు నిమజ్జనంతో బతుకమ్మకు వీడ్కోలు పలికారు. 'ఇస్తినమ్మా వాయినం, పుచ్చుకుంటినమ్మ వాయినం..' అనుకుంటూ మహిళలు అందరూ ఒక చోట చేరి ప్రసాదం ఇచ్చి పుచ్చుకున్నారు. వేడుకల్లో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్ షాలోమ్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి పల్లా నీలిమ, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్లు పోకల జమున లింగయ్య, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మహిళా మాజీ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. డీసీపీ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ రెడ్డి, ఆయా ప్రాంతాల ఏసీపీ, సీఐ, ఎస్సై, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, వేడుకలు ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిఘా వేశారు.

- మరిన్ని ఫొటోలు 9లో▸

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చెరువు వద్ద ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు.


పాలకుర్తి టౌన్: బతుకమ్మతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


బతుకమ్మ పేరుస్తున్న ఎమ్మెల్యే పల్లా సతీమణి నీలిమ


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


పట్టణంలోని బతుకమ్మకుంట వద్ద వేడుకలకు భారీగా హాజరైన జనం


బతుకమ్మ ఆడుతున్న యువతులు


బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

అవమానించిన చోటే..గౌరవం పొందాలని

- గ్రూప్–2లో కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగం సాధించిన శ్రావణి


కౌంసాని శ్రావణి

రఘునాథపల్లి: అవమానించబడ్డ చోటే గౌరవం పొందాలన్న కసి ఆమెను విజయతీరాలకు చేర్చింది. అంకిత భావంతో అహర్నిషలు చదివి అనుకున్నది సాధించింది రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కౌంసాని శ్రావణి. ఆమెకు మూగ, వినికిడి సమస్యలు ఉండేవి. దీంతో అనేక అవమానాలకు గురైంది. వెక్కిరించిన వారి నోళ్లను మూయించాలంటే చదువే ఆయుధంగా భావించింది. తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూపు–2 ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించి కో ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం పొందింది. మొదట జేపీఎస్‌గా, ప్రస్తుతం జిల్లా కేంద్రంలో స్టాంప్ అండ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. జేపీఎస్‌గా పనిచేస్తున్న సమయంలో వినికిడి సమస్య కారణంగా అనేక ఇబ్బందులు పడింది. అహర్నిశలు శ్రమించి గ్రూప్–2 ఉద్యోగం సాధించింది. భర్త బాల్‌రెడ్డి ఎంతో అండగా నిలిచి ప్రోత్సహించారని శ్రావణి తెలిపింది.

పింఛన్లను తక్షణమే పెంచాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతవులకు తక్షణమే పింఛన్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనగామ జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు, వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను రూ.2016 నుంచి రూ.4వేలకు పెంచుతానని ఎన్నికల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 6 నుంచి నవంబర్ 6వ తేదీవరకు నిర్వహించనున్న మహాదీక్షలను ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొట్ల మహేశ్, గాదె శ్రీధర్, గుర్రం నవీన్, గుర్రం అశోక్, సంపత్, సోమన్న, శ్రీను, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీల్‌మాదిగ

బహుమతుల ప్రదానం

జనగామ: పట్టణంలోని రంగప్ప చెరువు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో బుస జ్యోతి, జయ,కళ్యాణి, సంగీతకు కమిటీ ప్రతినిధులు మంచాల రవీందర్, వంగాల కళ్యాణి మల్లారెడ్డి, నారాయణ, బుస్సా కేదారి, రంగ నర్సింగరావు, పానుగంటి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు.


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

'అన్‌రిజర్వుడు అభ్యర్థులకు అన్యాయం'

జనగామ: రాజ్యాంగబద్ధంగా రావాల్సిన 33 శాతం సీట్లు ఓసీలకు రావాల్సిందేనని, తాజాగా స్థానిక సంస్థల రిజర్వేషన్ల కేటాయింపుతో అన్‌రిజర్వుడు అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓసీలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరుతూ మంగళవారం 11 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని, ఓసీ వర్గం కలసి రావాలని పిలుపునిచ్చారు.

స్థానిక సంగ్రామం

- మోగిన ఎన్నికల నగారా
- రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- జిల్లాలో రెండు విడతల్లోనే సర్పంచ్ ఎన్నికలు
- 12 జెడ్పీటీసీలు, 134 ఎంపీటీసీలు, 280 గ్రామపంచాయతీలు
- 4,01,496 మంది ఓటర్లు


మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన ఏసీ, డీసీపీ, ఏఎస్పీ

జనగామ: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ (ఈసీ) సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొదటి విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీ ఎలక్షన్లను నిర్వహిస్తామని ప్రకటించింది. ఈసీ ప్రకటనతో పల్లెల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం హీ టెక్కింది. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్ పరిధిలో 12 మండలాలు ఉండగా, 12 జెడ్పీటీసీ స్థానాలు, 134 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొదటి విడత అక్టోబర్ 9, రెండో విడత 27న పోలింగ్ జరుగనుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం ఎలక్షన్ నిర్వహణపై పూర్తి స్థాయి దృష్టి సారించింది.

రెండు దశల్లో పోలింగ్..

జిల్లాలో ఎలక్షన్లు రెండు దశల్లో జరగనున్నాయి. మొదటి విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్లకు సంబంధించి వచ్చే నెల అక్టోబర్ 9వ తేదీన నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండగా, 23వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. రెండో దశ ఎన్నికలు 13న నామినేషన్లు, 27న పోలింగ్ జరుగనుంది. జిల్లాలోని 12 మండలాలు, రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 12 జెడ్పీటీసీలు, 134 మంది ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పరిధిలో 294 పోలింగ్ లొకేషన్లు ఉండగా, 783 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొదటి దశలో 6 మండలాల పరిధిలో 70 ఎంపీటీసీలు, రెండో దశలో 6 మండలాల పరిధిలో 64 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎలక్షన్ అధికారులు, సిబ్బంది సిద్ధం..

ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆర్వోలు, ఏఆర్వోలు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఏపీఓలు, ఓపీఓలకు బాధ్యతలు కేటాయించారు. పోలింగ్ సెంటర్లు సిద్ధం చేసి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

దసరా పండుగ–ఓటర్ల ప్రసన్నం..

దసరా పండుగ వాతావరణం ఈ ఎన్నికలకు ప్రత్యేక రుచిని తెచ్చింది. పండుగ వేళను దృష్టిలో ఉంచుకొని ఆశావాహులు ఓటర్లను ఆకట్టుకునే విధంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేసేందుకు సిద్ధమవుతూనే... తమ వర్గాల మద్దతు బలపడేలా ప్రత్యేక వ్యూహాలు రూపొందిస్తున్నారు.

కోడ్ అమలులోకి..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్థానిక సంస్థల ఎలక్షన్ నేపథ్యంలో జిల్లాలో కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్ పండేరి నితిన్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశం హాల్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నిలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయగా, వచ్చే నెల 9వ తేదీన నోటీసు జారీ చేస్తుందన్నారు. మొదటి విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో 9వ తేదీ (చివరి తేదీ 11), రెండో విడతలో 13వ తేదీ (చివరి తేదీ15) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. మొదటి విడత అభ్యర్థుల ఫైనల్ జాబితా 15న, రెండో విడత 19న ప్రచురించడం జరుగుతుందన్నారు. మొదటి విడతలో 23, రెండో విడత 27వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీలు, అభ్యర్థులు నియమావళిని పాటించాలన్నారు. జిల్లాలోని మునిసిపాలిటీల పరిధిలో ఎన్నికల కోడ్ ఉండదన్నారు.

ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికల మండలాలు:

మొదటి విడత: చిల్పూరు, కొడకండ్ల, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల, లింగాలఘణపురం,
రెండో విడత: తరిగొప్పుల, బచ్చన్నపేట, జనగామ, నర్మెట, రఘునాథపల్లి, జఫర్‌గఢ్

బ్యాలెట్ బాక్స్‌లు: (అదనపు కలుపుకుని)	1,439
జెడ్పీటీసీ ఆర్వో:	15
ఎంపీటీసీ ఆర్వో:	55
ఎంపీటీసీ ఏఆర్వో:	55
పీవో(పోలింగ్ ఆఫీసర్):	2,018
ఏపీవో:	1,907
క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు:	304
సున్నితమైన పోలింగ్ స్టేషన్లు:	124
హాని కలిగించే పోలింగ్ స్టేషన్లు:	56
మండలాలు:	12
ఎంపీటీసీలు:	134
జెడ్పీటీసీలు:	12
పోలింగ్ లొకేషన్లు:	294
పోలింగ్ స్టేషన్లు:	783
100శాతం ఎస్టీ జీపీలు:	39
జిల్లాలో ఓట్లు:	4,01,496
పురుషులు:	1,98,525
మహిళలు:	2,02,963

రెండు విడతల్లోనే సర్పంచ్ ఎన్నికలు..

జిల్లాలో 280 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,534 వార్డులు, 30 వందశాతం ఎస్టీ జీపీలు ఉండగా, షెడ్యూల్డ్ ఏరియా జీపీలు 241 ఉన్నాయి. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతుండగా, జిల్లాలో మాత్రం రెండో విడత నుంచి నుంచి ప్రారంభం కానున్నాయి. రెండో విడత నవంబర్ 4న, మూడో విడత 8వ తేదీన పోలింగ్ జరుగనుంది. రెండో విడతలో 7 మండలాల పరిధిలో (142 జీపీలు), మూడో విడతలో 5 మండలాల పరిధి(138 జీపీలు)లో పోలింగ్ జరుగనుంది. రెండో విడతలో జరిగే జీపీలు చిల్పూరు మండలం (17 జీపీలు, 168 వార్డులు), స్టేషన్‌ఘన్‌పూర్(15/46), జ ఫర్‌గడ్(21/94), రఘునాథపల్లి (36/320), లింగాలఘణపురం (21/196), నర్మెట(17/48), తరిగొప్పుల (15/126), మూడో విడతలో బచ్చన్నపేట (26/238), జనగామ(21/198), దేవరుప్పుల(32/274), పాలకుర్తి (38/33 6), కొడకండ్ల(21/190) జీపీల పరిధిలో ఎలక్షన్లు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

క్లుప్తంగా

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశం

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌లో చేరడానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు. 2020–మే 2025 మధ్య ఉత్తీర్ణులైన ఇంజనీరింగ్, డిప్లొమా, ఏదేని గ్రాడ్యుయేట్స్ అర్హులని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వరంగల్ రీజియన్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తప్పని సరిగా https://nats.education.gov.in వెబ్ ‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు హనుమకొండ బస్ స్టేషన్ రెండో అంతస్తులోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో అక్టోబర్ 7న ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు వాక్–ఇన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99592 26045 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో మల్లేశ్

కాటారం: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండల కేంద్రం సమీపం సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఎర్రగుంటపల్లికి చెందిన మాచెర్ల మల్లేశ్ సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మండల కేంద్రంలోని గారెపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాళేశ్వరం వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో మల్లేశ్ రోడ్డుపై ఎగిరిపడగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు క్షతగాత్రుడిని 108లో ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం మల్లేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆర్టీసీ బస్సును స్టేషన్‌కు తరలించారు.

జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్ సస్పెన్షన్


ఎస్సై రాంచరణ్

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్ రాంచరణ్‌ను సస్పెండ్ చేశారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఇద్దరు ఎస్సైలు సైతం పాత కేసుల విషయంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. వరుసగా ముగ్గురు ఎస్సైలపై వేటుపడడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. దీంతో జఫర్‌గఢ్ పోలీస్‌స్టేషన్ అంటేనే ఎస్సైలు హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

చిల్పూరు: కుమారుడు చనిపోయాడనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు(48) కుమారుడు గతేడాది మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి రాములు మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు.

కీటకం.. కీలకం


ఆయిల్ పామ్‌లో అధిక దిగుబడికి పుష్పాల పరాగ సంపర్కం కీలకం

● ఈ ప్రక్రియ జరగడంలో పురుగుల పాత్ర ప్రధానం

హన్మకొండ: ఆయిల్ పామ్ సాగులో అధిక దిగుబడికి పరాగ సంపర్కం కీలకం. పరాగ సంపర్కం జరగడానికి కీటకాలు అవసరం. ఇందులో ఎలాయిడోబియస్ కామెరూనికస్ కీటకాలు ఆయిల్ పామ్ తోటల్లో పరాగ సంపర్కం జరగడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఆయిల్ పామ్ పుష్పాలను పరాగ సంపర్కం చేయడంలో కీటకాలు కీలకంగా పని చేస్తాయి. కాత కోసం రైతులు, అధికారులు పరగా సంపర్కానికి కీటకాలను తోటల్లో వదులుతున్నారు. ఇవి పూతను పిందెగా మార్చి దిగుబడిని పెంచుతాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 15 వేల ఎకరాల్లో సాగు చేశారు. 2022 ఆగస్టులో ముందుగా హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో సాగు చేశారు. అప్పుడు దాదాపు 5,500 ఎకరాల్లో సాగు చేశారు. మూడేళ్ల క్రితం సాగు చేసిన తోటలు కొన్ని దిగుబడి ఇస్తుండగా మరికొన్ని తోటలు కాతకు వచ్చాయి. కాతకు వచ్చిన తోటల్లో పరాగ సంపర్కం కోసం రైతులు, అధికారులు ఆఫ్రికన్ పురుగులను తోటల్లో వదులుతున్నాయి.

ఆయిల్ పామ్ తోటల్లో పురుగుల యాజమాన్యం..

ఎలాయిబోడియస్ కామెరూనికస్ పురుగు క్యూర్‌క్యులియోనిడే కుటుంబానికి చెందింది. ఆఫ్రికా ప్రాంతానికి చెందిన కీటకం. ఆడ కీటకం పుష్పాల లోపల గుడ్లు పెడుతుంది. లార్వా పుష్పంలోని కణజాలంలో పెరిగి ఆహారం తీసుకుంటుంది. ప్యూపా దశలో పుష్పం లేదా ఇన్‌ఫ్లోరెన్స్ లోపల రూపాంతరం చెందుతుంది. ఈ కీటకం చిన్న పరిణామంలో దాదాపు 4 మిల్లీ మీటర్ల పొడవు ఉండి నల్లని గోధుమ రంగులో ఉంటుంది. వీటి ఆయుష్షు 1 నుంచి 2 నెలలు. ఒక్క సారి వదిలితే సంతానాన్ని వృద్ధి చేసుకుంటూ తోటల్లోనే ఉంటుంది. ఇది ఆయిల్ పామ్ పరాగ సంపర్కంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ పురుగులను పరాగ సంపర్కానికి ఉపయోగించడం ద్వారా దిగుబడిని పెంచొచ్చని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. మగ పుష్పాల నుంచి ఆడ పుష్పాలకు పుప్పొడి తరలిస్తూ సహజ పరాగ సంపర్కం చేస్తాయి. దీంతో ఆయిల్ పామ్‌లో ఫలసాధన శాతం పెరుగుతుంది. ఆయిల్ పామ్ సాగు చేసిన 30 నెలలకు కాతకు వస్తుంది. అంతకు ముందు గెలలు వేసినా వాటిని తొలగించాలి. మొక్కలు నాటిన 26, 27 నెలలకు ఈ పరాగ సంపర్క కీటకాలను తోటల్లో వదిలిపెట్టాలి. 30 నెలలకు గెలలు వదిలిపెట్టాలి. గెల వేసిన 4 నుంచి 5 నెలలకు పక్వానికి వచ్చి కోతకు వస్తాయి.


ఎలాయి దోబియస్ కామెరూనికస్ కీటకం


గెలలతో ఆయిల్ పామ్ మొక్క

సహజ పరాగ సంపర్కం..

ఈ కీటకాలతో మానవ శ్రమ లేకుండా పుప్పొడి బదిలీ జరిగి సహజ పరాగ సంపర్కం జరుగుతుంది. ఫలగుచ్ఛంలో గింజల నింపుదల బాగా పెరుగుతుంది. ఖర్చు తగ్గుతుంది. రసాయనాల అవసరం లేకుండా సహజంగా పనిచేస్తుంది. నిరంతర పుప్పొడి వ్యాప్తి జరుగుతుంది. పుష్పించే కాలమంతా వీటివల్ల ఫలసాధన కొనసాగుతుంది. ఆయిల్ పామ్ సాగులో ఎలాయిబోడియస్ కామెరూనికస్ ప్రవేశపెట్టిన తర్వాతే ప్రపంచవ్యాప్తంగా ఆ పంటలో దిగుబడులు గణనీయంగా పెరిగాయని ఉద్యాన అధికారులు తెలిపారు. ఈ కీటకాలు సహజంగానే నిరంతరం పని చేస్తాయి. ఇవి సహజసిద్ధంగా పని చేయడం వల్ల ఖర్చు తగ్గి, నూనె ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా అధిక ఆదాయం వస్తుంది.

పరాగ సంపర్క కీటకాలు కీలకం..



ఆయిల్ పామ్ తోటల్లో పరాగ సంపర్క కీటకాల పాత్ర కీలకం. మానవ అవసరం లేకుండా పుప్పొడిని చేరవేస్తాయి. పూతను పిందె, కాయగా మార్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. దిగుబడి పెరుగుతుంది. రైతులు లాభసాటి అయిన ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి.

– శ్రీనివాస్ రావు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, వరంగల్

గోదావరి ఉగ్రరూపం..


కాళేశ్వరంలోని సరస్వతీఘాట్ వద్ద వరద ఉధృతి


పలిమెలలో నీట మునిగిన మిర్చి పంట

● కాళేశ్వరం వద్ద 13.240 మీటర్ల ఎత్తున నీటిమట్టం
● మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
● వందలాది ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి పంటలు నీటమునక
● ఆందోళనలో రైతులు

కాళేశ్వరం : గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువన భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకల్లోకి వరద నీరు చేరుతోంది. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ 13.240 మీటర్ల ఎత్తులో తరలిపోతుంది. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాళేశ్వరం తీరంపైగల చిరు దుకాణాల్లోకి వరదనీరు చేరడంతో అధికారులు ఖాళీచేయించారు. ఇప్పటికే నీటి మట్టం 12.210మీటర్ల ఎత్తు దాటగా మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. చివరి ప్రమాదహెచ్చరిక 13.460 మీటర్లు దాటితే జారీ చేస్తారు. రాత్రి వరకు దాటే అవకాశం ఉందని అధికారుల ద్వారా తెలిసింది. దీంతో అధికార యంత్రాంగం దిగువ లోతట్టు గ్రామాలను అప్రమత్తం చేస్తోంది. ఎప్పటికప్పుడు వరద సమాచారం సమీక్షిస్తున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గోదావరి వరదనీరు కమ్మేయడంతో చంద్రుపల్లి, మద్దులపల్లి వాగులు ఉప్పొంగాయి. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

మేడిగడ్డకు..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 11.37 లక్షల క్యూసెక్కుల వరద తరలివస్తోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 85 గేట్లు ఎత్తినీటిని దిగువకు తరలిస్తున్నారు. ఈ వర్షాకాలం సీజన్‌లో ఇంత వరద రావడం ఇదే మొదటిసారని ఇరిగేషన్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

నీటమునిగిన పంటలు..

మహదేవపూర్ మండలం అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బల్లాపూర్, పూస్కుపల్లి, కాళేశ్వరం, మహదేవపూర్, బొమ్మాపూర్ తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు ఈ సీజన్‌లో నాలుగో సారి పంటలు మునిగి నష్టపోయామని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పలిమెలలో..

పలిమెల: గోదావరి వరద ప్రవాహానికి మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంట పొలాలు, చేలు నీట మునిగాయి. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేస్తే గోదావరి వరదతో తీరని నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

కేబుళ్లు క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ స్తంభాలకు కేబుళ్లను క్రమపద్ధతిలో అమర్చాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సంస్థ పరిధిలోని 16 సర్కిళ్ల (జిల్లా) కేబుల్ అపరేటర్లు, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల పైనుంచి బ్రాడ్ బ్యాండ్ కేబుల్ వైర్లు ఏర్పాటు చేయొద్దన్నారు. భూమి నుంచి 18–20 ఫీట్ల ఎత్తులో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రోడ్ క్రాస్సింగ్స్ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపయోగంలో లేని కేబుల్ వైర్లను 3 నెలలలోపు తొలగించాలని ఆదేశించారు. ప్రతీ బ్రాడ్ బ్యాండ్ కేబుల్ వైర్లను జీఐఎస్ మ్యాపింగ్ చేసుకుని వాటి కోఆర్డినెట్స్ ఎన్పీడీసీఎల్‌కు అందజేయాలన్నారు. ఆరునెలల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు రాజు చౌహాన్, అశోక్, సి.జి.ఎం ఆర్. చరణ్ దాస్, వరంగల్ ఎస్ఈ కె.గౌతమ్ రెడ్డి, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, జీఎంలు సురేందర్, డివిజనల్ ఇంజనీర్లు జి.సాంబరెడ్డి, ఎస్.మల్లికార్జున్, అనిల్ కుమార్, బీఎస్ఎన్ఎల్ డీజీఎం కిషన్, అజయ్, ఎయిర్ టెల్, జియో, యాక్ట్ ఫైబర్ నెట్, ఐ రీచ్ ప్రతినిధులు, స్థానిక కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

'గెస్ట్' పోలీస్ స్టేషన్!

● అలా వస్తారు.. ఇలా వెళ్తారు..
● ప్రహసనంలా సీఐ, ఎస్సైల బదిలీలు

గీసుకొండ: గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు 'గెస్ట్' పోలీస్ స్టేషన్ అనే పేరుంది (నిక్‌నేమ్). పోలీసు అధికారులు ఈ స్టేషన్‌కు అలా గెస్ట్‌లా వచ్చి కొన్ని రోజులు పని చేసి బదిలీపై వెళ్లిపోతుంటారు. సీఐలు అయితే మహా అంటే ఏడాది లోపు.. ఎస్సైల విషయం చెప్పాల్సిన పనే లేదు. బదిలీపై వచ్చిన ఎస్సైలు ఇక్కడ ఎన్ని నెలలు ఉంటారో లేదో తెలియదు. కొందరైతే పోస్టింగ్‌పై వచ్చి రెండు, మూడు నెలల లోపే బదిలీ అవుతున్నారు. గతంలో అయితే బదిలీపై వచ్చిన పోలీసు అధికారులు కనీసం ఏడాది, రెండేళ్ల వరకు విధులు నిర్వర్తించే వారు. దీంతో వారికి స్థానిక పరిస్థితులపై, ముఖ్యంగా శాంతిభద్రతల విషయంలో అవగాహన కోసం అవసరమైన సమయం ఉండేది. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. వచ్చిన అధికారికి మండలంలోని గ్రామాల పేర్లు, రూట్‌లు, స్థానిక స్థితిగతులు తెలుసుకునే లోపే బదిలీ అవుతుండడం విశేషం. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేకత ఉంది. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని గీసుకొండ రూరల్ మండలంలోని గ్రామాలతోపాటు గ్రేటర్ వరంగల్ నగరంలోని 15,16,17 డివిజన్లు ఉన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉండే మండలంలో ప్రశాంతంగా ఉన్నట్లే కనిపించినా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఉంటాయని ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన పలువురు పోలీసు అధికారులే చెబుతున్నారు. అలాంటి పరిస్థితిలో డ్యూటీలో చేరిన నెలలోపే బదిలీ చేస్తుండడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా గీసుకొండ సీఐ మహేందర్‌ను ఇక్కడి నుంచి పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఇక్కడికి వచ్చి ఏడాది కూడా కాలేదు. ఆయన స్థానంలో పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న డి. విశ్వేశ్వర్‌ను గీసుకొండకు బదిలీ చేశారు. విశ్వేశ్వర్ ఇదే పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా 2012 జూలై నుంచి 2013 ఆగస్టు వరకు పని చేశారు. అప్పట్లో ఆయన పనితీరును చూసి మండల వాసులు గబ్బర్‌సింగ్ అని పిలిచేవారు.


గీసుకొండ పోలీస్ స్టేషన్

ఆకుకూరలతో ఆరోగ్యం..!

● రక్తహీనత నివారణ, కండరాల పటిష్టతకు దివ్య ఔషధం
● కంటి చూపుకు మేలు
● ఆకుకూరలు తినాలంటున్న వైద్యులు

ఖిలా వరంగల్ : ఆధునిక యుగంలో అందరిలోనూ అనారోగ్య సమస్యలు. చిన్న వయసులోనే పలు రోగాలు. అందుకు వైద్యులు చెప్పే సమాధానం ఆహారపు అలవాట్ల మార్చుకోవాలని. ఈ మాట మాంసాహార ప్రియులకు మింగుడు పడకపోయినా.. ఆరోగ్యం కోసం శాఖాహారం తీసుకోవాలని చెబుతున్నారు. ఫలితంగా వరంగల్ నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే చాలా మంది ఆహారపు అలవాట్లు మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజా ఆకుకూరలపై దృష్టిసారిస్తున్నారు. ఆకుకూరల్లో కేలరీలు తక్కువ ఉండడంతో బరువు నియంత్రణకు ఎంతో ఉపయోగపడుతాయి. శరీరానికి కావాల్సిన విటమిన్లు, ప్రొటీన్లను ఆకుకూరల ద్వారా పొందొచ్చు. కొవ్వు తక్కువ ఉండడంతోపాటు ఆహారాన్ని రుచిగా చేయడం ఆకుకూరల ప్రత్యేకత. ఈ నేపథ్యంలో ప్రతీ రోజు ఆహారంలో ఆకుకూరను తప్పని సరిగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఆకుకూరలతో ఎన్నో ప్రయోజనాలు..

ఆకుకూరలు, కూరగాయలు తినడం ద్వారా ఎలాంటి రోగాలు ధరిచేరవని పలువురు వైద్యులు వెల్లడిస్తున్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే పిల్లలకు చిన్నప్పటి నుంచే శాఖాహారం అలవాటు చేయాలని వైద్యులతోపాటు కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆకుకూరలో పోషక పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శారీరక పెరుగుదలకు ఎంతో ఉపయోగపడతాయి. ఖనిజ పోషకాలు, ఇనుము, కాల్షియం, కెరోటిన్, విటమిన్ 'సీ' పుష్కలంగా లభిస్తాయి. ఇనుములోపంతో బాధపడే గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు ఎంతో మేలు చేస్తాయి. ఆకుకూరల్లో విటమిన్ 'ఏ' ఉంటుంది. ఇది కంటి చూపును పరిరక్షిస్తుంది. ఐదేళ్లలోపు చిన్నారులు కంటిచూపు ఎక్కువ కోల్పోతున్న తరుణంలో ఆకుకూరలు మేలు చేసి అంధత్వం రాకుండా తోడ్పడతాయి.

చిన్న వయసులోనే జబ్బులు..

నేటి పోటీ ప్రపంచంలో ఆరేళ్ల చిన్నారి నుంచి.. 60 ఏళ్ల వృద్ధుల వరకు పరుగులు పెడుతున్నారు. తద్వారా అతి చిన్న వయసు నుంచే వివిధ రోగాల బారిన పడుతున్నారు. దీనిని ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్న ప్రజలు మాంసాహారానికి బదులు ఆకుకూరలు, కూరగాయలపై ఆసక్తి చూపుతున్నారు. కాగా, కూరగాయలు తోడుంటే ఆరోగ్యం మీ వెంటే అంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తోటకూర..



రక్తహీనతతో బాధపడే వారికి దీనిని మించిన పోషకాహారం లేదు. ఎందుకంటే రిబోఫ్లేవిన్, పోలేట్, విటమిన్–ఏ, కే, బీ,సీలతోపాటు కాల్షియం, పొటాషియం, పాస్ఫరస్, జింక్, కాపర్, మాంగనీస్ వంటి ఖనిజాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. విత్తనాల నుంచి తీసిన నూనె గుండె వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరం. బీపీని నియంత్రిస్తుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

పాలకూర..



ప్రజలు ఎక్కువ తినేది ఇదే. పోషక విలువలు ఇందులో ఎక్కువ ఉంటాయి. శరీరానికి చలువ. దగ్గు, ఆస్తమా, ఇతత్రా రుగ్మతలను నివారిస్తుంది. ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్–'ఏ' తోపాటు కీలకమైన అమైనో అమ్లాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. పోటాషియం, సల్ఫర్, సిలికాన్, మాంగనీస్, సోడియం వంటివి సమపాళ్లలో లభిస్తాయి. కడుపులో మంట తగ్గిస్తుంది. దీని జ్యూస్ కాలేయ రుగ్మతలను తొలగిస్తుంది.

మెంతికూర..



అద్భుత ఔషధ ఆహారం. రోజు తింటే ఆరోగ్యానికి మంచిది. కాల్షియం, ఇనుము, పాస్ఫరస్‌తోపాటు ప్రొటీన్లు ఎక్కువే. ఆకలి పుట్టిస్తుంది. అంతేగాకుండా దగ్గు, వాంతులు, కీళ్ల వ్యాధులు, నులిపురుగులను నివారిస్తుంది.

కొత్తిమీర..



జీర్ణక్రియను పెంచుతోంది. ఆకలి పుట్టిస్తుంది. చల్లదనం ఇస్తుంది. కళ్లకు మంచిది. అందుకే దీనిని రోజు ఏదో ఒక రూపంలో తీసుకోవడం మంచిది. ఇందులో ఐరన్, కాల్షియం, పాస్ఫరస్, విటమిన్ –ఏ, సీలు ఎక్కువ ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇతర కూరలతో కలిపి వండినా మంచి వాసన ఇస్తుంది.

గోంగూర..



ఆవకాయ తర్వాత తెలుగు వారు గోంగూర పచ్చడికే ప్రాధాన్యం ఇస్తారు. పచ్చడి పెట్టినా.. పప్పు చేసినా.. మాంసంలో కలిపి వండినా ఇలా ఏ విధంగా చేసినా దీని రుచి అమోఘం. దీని పుంటి కూర అని కూడా పిలుస్తారు. ఐరన్ నిల్వలకు గోంగూర పెట్టింది పేరు. ఇతర విటమిన్లు ఎక్కువ. తెల్లది, ఎర్ర, పుల్ల గోంగూర పేర్లతో ఇది లభిస్తుంది.

పెరటి కూరలే ఆకుకూరలు..

ఆకు కూరల కోసం ప్రత్యేకంగా కష్టపడాల్సిన పనిలేదు. మార్కెట్ వెంట పరుగులు తీసి కొనుగోలు చేయాల్సిన అవసరమూ లేదు. శ్రద్ధ వహించి ఇంటి ఆవరణలో కొద్దిపాటి ఖాళీ స్థలం ఉన్నా ఎంచక్కా పెంచుకోవచ్చు.

ఆకుకూరలు తోడుంటే ఆరోగ్యమే..



ఆకుకూరలు, కూరగాయలు తినడం ద్వారా ఎలాంటి రోగాలు ధరిచేరవు. పిల్లలకు వ్యాధులు రాకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే శాఖాహారం అలవాటు చేయాలి. నిత్యం మనం తినే ఆహారంలో ఆకుకూరలను చేర్చుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. శరీరానికి రోగ నిరోధక శక్తినిచ్చే ఖనిజ లవణాలు, విటమిన్లు ఆకుకూరల్లో ఉంటాయి. ఇవి తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. – డాక్టర్ వినోద్‌కుమార్, జనరల్ సర్జన్, వరంగల్

పండుగకు స్వగ్రామానికి వస్తూ మృత్యుఒడికి..

● రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


కోమలి(ఫైల్)

ఆలేరురూరల్/చిల్పూరు: దసరా పండుగకు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి కుమారుడితో కలిసి బైక్‌పై వస్తున్న మహిళ రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఈ ఘటన సోమవారం హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కందిగడ్డతండా శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన సాదం కోమలి(42) తన భర్త రవి, కుమారుడు రాజుతో కలిసి హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో నివాసముంటోంది. అక్కడే ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో కోమలి, ఆమె భర్త రవి కలిసి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. దసరా పండుగకు కోమలి, ఆమె కుమారుడు రాజు కలిసి సోమవారం బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరు మండలం కందిగడ్డతండా శివారులోని ఛత్రపతి శివాజీ దాబా వద్దకు రాగానే అదే మార్గంలో మరో బైక్‌పై వస్తున్న అందె భాస్కర్ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కోమలి ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. కోమలిని వెంటనే ఆమె కుమారుడు ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆలేరు సీఐ యాలాద్రి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కోమలి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

కన్నాయిగూడెం: సద్దుల బతుకమ్మకు పూల కోసం చెరువులోకి వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సర్వాయి జీపీ పరిధి చిట్యాల గొత్తికోయ గూడెంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సోడె లక్ష్మయ్య (24) కొంతకాలం నుంచి తన పెద్దనాన్న గ్రామం చిట్యాల గొత్తికోయ గూడెంలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సద్దుల బతకమ్మకు తామర పూల కోసం చెరువులోకి వెళ్లాడు. పూలు తెంపుతూ నీట మునిగి మృతి చెందాడు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొని..

● గుండెపోటుతో యువకుడి మృతి


సుమన్(ఫైల్)

కురవి: బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఇంటికి వచ్చిన తర్వాత ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సోమవారం రాత్రి మండలంలోని నేరడలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొలిపాక నర్సయ్య, పద్మ దంపతుల చిన్న కుమారుడు సుమన్(28) సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. వేడుక ముగిసిన తర్వాత ఇంటికి వచ్చి భోజనం చేసి మంచంపై కూర్చున్నాడు. గుండె వద్ద నొప్పి రావడంతోనే హఠాత్తుగా మంచంపై నుంచి కిందపడ్డాడు. దీంతో వెంటనే కుటుంబీకులు మానుకోట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో సద్దుల బతుకమ్మ పండుగ రోజు ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

మైసూర్ ఉత్సవాలను తలపించేలా దసరా వేడుకలు


మాట్లాడుతున్న నాగపూరి సంజయ్‌బాబు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న దసరా ఉత్సవాలను మైసూర్ ఉత్సవాలను తలపించేలా ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు గౌడ్ అన్నారు. వరంగల్ కరీమాబాద్‌లోని ఆదర్శ పరపతి సంఘం భవనంలో ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో సంజయ్‌బాబు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి రంగలీల మైదానంలో రావణవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైందన్నారు. ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, రంజిత్‌గౌడ్, సందీప్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, అఖిల్‌గౌడ్, పూజారి అజయ్, సంజీవ్, వాసు, అశోక్, బిట్ల క్రాంతి, మహేశ్, శ్రీను, గోవర్ధన్, చిరంజీవి, రంజిత్, వంశీ, నాగరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి భద్రపీఠసేవ, అశ్వవాహన సేవ

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని కాళరాత్రి క్రమంలో దుర్గార్చన జరిపి భద్రపీఠ సేవ నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహనసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ రామల సునీత, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, రాములు, శ్రవణ్‌రెడ్డి, అంజేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మూగ శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.


అమ్మవారికి భద్రపీఠ సేవ